ఇందూరులో వన మహోత్సవం షురూ

- మూడు లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యం
- ఫారెస్టు, జిల్లా జైలు, డ్వాక్రా సంఘాల ద్వారా మొక్కలు
- మెప్మా ద్వారా ఇంటింటికి మొక్కల పంపిణీ
- రోడ్లకు ఇరువైపులా నాటేలా చర్యలు


పార్కులో మొక్కలకు గుంతలు తవ్వుతున్న కూలీలు


కాలూరు రోడ్డులో మొక్కలు నాటుతున్న కూలీలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభమైంది. కార్పొరేషన్ పరిధిలో మొత్తం మూడు లక్షల మొక్కలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. నగరంలోని ఖాళీ స్థలాల్లో, పార్కుల్లో మొక్కలు నాటాలని కమిషనర్ అధికారులకు సూచించారు. వనమహోత్సవానికి కావాల్సిన మొక్కలను ఫారెస్టు ఆఫీసు, జిల్లా జైలుతోపాటు మహిళా సమాఖ్య సంఘానికి కూడా అప్పగించారు. ఇందులో 1.50 లక్షలు ఫారెస్టు విభాగం నుంచి తీసుకోగా, మరో 1.50 లక్షల మొక్కలను జిల్లాజైలులో పెంచారు. మహిళా సమాఖ్య సభ్యురాలు మరో 50 వేల మొక్కలు తమ నర్సరీల్లో పెంచారు. వీటిని మున్సిపల్ పార్కులు, రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో నాటాలని అధికారులు సూచించారు. ఖానాపూర్–కాలూరు రోడ్డులో మొక్కలు నాటే ప్రక్రియను ఈఈ మురళీమోహన్ రెడ్డి పరిశీలిస్తున్నారు. కాలూరులోని మినీ ట్యాంక్ బండ్, మాధవనగర్‌లోని చెరువు ప్రాంతంతోపాటు నగరంలోని పలు పార్కులు మొక్కలు నాటుతున్నారు.

మెప్మా ద్వారా మొక్కల పంపిణీ

ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నారు. మెప్మా సీవోలు, ఆర్పీలు, ఇతర డ్వాక్రా సంఘ సభ్యురాళ్ల ద్వారా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయనున్నారు.

మొక్కల సంరక్షణకు అమృత మిత్రలు

మొక్కలు సంరక్షణకు ప్రభుత్వం అమృతమిత్రలను నియమించింది. వీరిని మెప్మా సంఘాల ద్వారా నియమించారు. పార్కుల్లో పెంచే మొక్కలను సంరక్షించడం వీరి బాధ్యత. ప్రధాన పార్కుల్లో ప్రస్తుతం వీరిని నియమించారు. ఆయా పార్కుల సమీపంలో ఉన్నవారినే అమృతమిత్రలుగా నియమిస్తున్నారు.

సరైన స్థలాల్లో మొక్కలు నాటాలి



ప్రతి ఏడాది మొక్కల పెంపకం పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. విద్యుత్ వైర్లకిందే మొక్కలు నాటుతున్నారు. అవి ఏపుగా పెరగగానే వాటిని కొట్టేస్తున్నారు. వైర్లకింద మొక్కలు నాటడం ఎందుకు, వాటిని కొట్టేయడం ఎందుకు. అధికారులు సరైన స్థలాల్లో మొక్కలు నాటాలి.

– ఇప్పకాయల కిశోర్, బీజేపీ నాయకుడు

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.



వనమహోత్సవానికి కావాల్సిన మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఫారెస్టు విభాగం, జిల్లా జైలుతోపాటు మహిళా సంఘాలు నిర్వహించే నర్సరీ నుంచి మొక్కలు పెంచుతున్నాం. నగరంలో 3 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని ఖాళీ స్థలాల్లో నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం.

– మురళీమోహన్‌రెడ్డి, మున్సిపల్ ఈఈ

తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు, కోలాటాల ప్రదర్శన, డప్పు వాయిద్యాలతో బోనాల పండుగను ఘనంగా చేపట్టారు. ఆషాఢమాసంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనం చేసి అమ్మవారిని కొలిస్తే స్వయంగా అమ్మవారే తమ ఇంటికి వస్తుందని నమ్మకంగా భావిస్తారన్నారు. మహాలక్ష్మీనగర్ వాసులు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా పండుగను నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు పంచరెడ్డి లావణ్యలింగం, శీతల్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పార్శి రాజు, అల్లాడి రాజు, బోగ గంగాధర్, ఆనంద్, శివునూరి భాస్కర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


సారంగపూర్‌లో..

సారంగపూర్‌లో..

నిజామాబాద్ రూరల్: సారంగపూర్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో ఉన్న దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్ గౌడ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 96 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా శుక్రవారం పంపిణీ చేశారు. బాధితులు దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 50శాతం ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి ఏది..?


కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్తకుప్ప

నిజామాబాద్ సిటీ: బల్దియాలోని శానిటేషన్ సిబ్బందికి చి(చె)త్త శుద్ధి లేకుండాపోతోంది. నిత్యం నగరాన్ని శుభ్రం చేయాల్సిన పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు వారి పరిసరాలను పట్టించుకోవడం లేదు. జోన్ కార్యాలయం ఎదుట చెత్త కుప్పలుగా పేరుకుపోతున్నా తొలగింపు చర్యలు చేపట్టడం లేదు. దుబ్బ జోన్–1 కార్యాలయం మెయిన్‌రోడ్డు పక్కనే ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో అటువైపు వెళ్తున్న పాదచారులు ముక్కుమూసుకుని వెళ్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మొక్కల రక్షణ అందరి బాధ్యత


దుబ్బాకలో మొక్క నాటుతున్న అధికారులు



ధర్పల్లి: మొక్కల రక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్ అన్నారు. ధర్పల్లి మండలంలోని దుబ్బాకలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గౌడ సంఘం, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 1250 ఈత మొక్కలను శుక్రవారం నాటారు. ఈత మొక్కలను కాపాడుకొని ఉపాధి పొందాలని గౌడ సంఘం సభ్యులకు భీంగల్ ఎక్సైజ్ అధికారి వేణు మాధవరావు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో వినోద, గౌడ సంఘం అధ్యక్షుడు రాజాగౌడ్, ప్రతాప్ గౌడ్, నరేశ్ గౌడ్, మల్లేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

కంజర్ పాఠశాలలో..

మోపాల్: మండలంలోని కంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటినట్లు హెచ్ఎం గోపాలచారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఎమ్మెస్ రాణి కాంతి కిరణ్, ఉమా గౌరీ భూమయ్య, విజయలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు వసంత, వాణి, అనిత భూమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియామకం



సిరికొండ: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గ్యామ శోభన్ నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలో శోభన్‌కు నియామకపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు నారాగౌడ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండారి నరేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చరిత్రాత్మక నిర్ణయం

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్ శుక్రవారం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అర్హులకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మోపాల్: నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, మొదటి విడతలో 3603 ఇళ్లు మంజూరయ్యాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండలంలోని మల్కాపూర్ (ఏ) మోడల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న సుమారు 15 ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సొంతింటి కల సాకారమవుతున్న ఆనందాన్ని ఎమ్మెల్యే ఎదుట లబ్ధిదారులు వ్యక్తపర్చారు. అంతకుముందు గుండారంలో 24 గంటల విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మల్కాపూర్ (ఏ)లో వన మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని మల్కాపూర్ (ఏ)ను మోడల్ గ్రామంగా ఎంపిక చేసి 120 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.

మొక్కలు పెంచే బాధ్యత మనదే..

వన మహోత్సవంలోభాగంగా నాటుతున్న మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సీనియర్ నాయకులు బాగారెడ్డి, భూమారెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు పాల్దా మాధవరెడ్డి, పూర్ణచందర్ రాజు, దాసరి ఒడ్డెన్న, దాసరి శ్రీధర్, మూత జనార్దన్, కొలాస్ మోహన్, కొర్వ గంగాధర్, గొడ్డళ్ల శ్రీనివాస్, సురేశ్, ప్రకాశ్, నగేశ్, డీఈ రమేశ్, ఏడీఈ బాలేశ్, ఎంపీడీవో రాంనారాయణరెడ్డి, తహసీల్దార్ అనిరుధ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే లక్ష్యం

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం పేదోడి కళ్లల్లో ఆనందం చూడాలనే ఏకైక లక్ష్యంతో ముందుకెళ్తుందని, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ చేసి పేదోడి కలలను సాకారం చేస్తుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలంలోని మల్కాపూర్ (ఏ) గ్రామపంచాయతీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రతి సోమవారం గ్రీన్‌చానెల్ ద్వారా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారికి బెదిరింపులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారిని కొందరు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పూసలగల్లిలో ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి ఓ ఫారెస్టు కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారి దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం లేదని, స్థానికుల నుంచి అభ్యంతరాలున్నాయని అధికారులు నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదు. అయినా పనులు చేయిస్తుంటే స్థానికులు మళ్లీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ సదరు స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. దీంతో ఆగ్రహం చెందిన సదరు అధికారికి సంబంధించిన నలుగురు వ్యక్తులు బల్దియా కార్యాలయానికి గురువారం మధ్యాహ్నం వచ్చారు. తన చాంబర్ నుంచి ఏసీపీ కిందికి వస్తుండటంతో నిర్మాణానికి ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదంటు భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో ఊర పండుగను జరుపుకోవాలి



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ఊర పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ అన్నారు. ఊర పండుగకు హాజరు కావాలని కోరుతూ సర్వసమాజ్ సభ్యులు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు, ఆదె ప్రవీణ్, రామ్మూర్తి గంగాధర్, బంటు రాజేశ్వర్, రామడుగు బాలకిషన్, సకినాల ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూ సమస్యను పరిష్కరించాలి



సిరికొండ: సిరికొండ శివారులోని సర్వే నంబర్ 532లో నెలకొన్న భూముల సమస్యను పరిష్కరించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు ఆర్ రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పట్టాదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిందన్నారు. రెవెన్యూ భూమి అని ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా అటవీ శాఖ అధికారులు ఇది అటవీ భూమి అంటు సాగు చేసుకోనివ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. హైకోర్టు లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అడ్డుకోవడం సరైంది కాదన్నారు. నాయకులు దామోదర్, సాయారెడ్డి, రమేశ్, కిశోర్, పండరి, అశోక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



సిరికొండ: సంఘం భవనం, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గడ్కోల్ ఎస్సీ మాదిగ సంఘం పెద్ద మనుషులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శుక్రవారం కలిసి కోరారు. అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, కట్ట సంతోష్, సిరికొండ బలరాం, సుద్దపల్లి నడ్పెన్న, తిరుపతి, సుమన్, రంజిత్, బాపు రావు, ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



డిచ్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిచ్‌పల్లి ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిచ్‌పల్లి తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మూడేళ్లుగా సుమారు రూ.6వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం చదువు పూర్తి చేసిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నితిన్, అవినాశ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభను విజయవంతం చేయాలి



ధర్పల్లి: ఉద్యమ నాయకుడు, పోరాట యోధుడు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు నాయక్వడి నర్సయ్య వర్ధంతి సభను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య శుక్రవారం పేర్కొన్నారు. అనంతరం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయికుమార్, బాబన్న, కనకయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,800	వెండి(కిలో)	1,13,500
22 క్యారెట్స్	91,205		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	75
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

బీసీ మహా ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న హైదరాబాద్‌లో చేపట్టే బీసీల మహా ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాను బీసీ సంఘాల సభ్యులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సుర్వి యాదయ్య, ప్రణీల్ చందర్, సుప్ప ప్రకాశ్, తమ్మన్నగారి సంగన్న, సిద్ధగోని శ్రీనివాస్, వల్లూరి వీరేశ్, నవీన్,సాగర్,రాజేశ్, మేకల కనకయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం



నిజామాబాద్‌నాగారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు తేవడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. శుక్రవారం కేర్ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వమించారు. కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, కోడూరు స్వామి, బగ్గలి అజయ్, శ్రీలత, చంద్రకాంత్, నరేందర్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై అవగాహన



నిజామాబాద్ అర్బన్: మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల గురించి మహిళా సంఘాల సభ్యులకు విస్తత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా పౌర సంబంధాల అధికారి పద్మశ్రీ నేతృత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందాలు మహిళా సాధికారత కార్యక్రమాల గురించి తమ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ ఫంక్షన్ హాల్‌లో ఒక బృందం, డొంకేశ్వర్ మండలంలోని సత్తె గంగవ్వ ఫంక్షన్ హాల్‌లో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. వడ్డీ లేని రుణాలు, మహిళా సాధికారత, ఉచిత బస్సు ప్రయాణం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

మాలలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



నిజామాబాద్‌నాగారం: మాలలకు విద్య, ఉద్యోగ, ఉపాధిలో అవకాశాలు కల్పించాలని కోరుతూ జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు చొక్కం దేవిదాస్, నాయకులు మంత్రి గడ్డం వివేక్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాలలకు వర్గీకరణ వల్ల జరుగుతున్న నష్టంపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపొందించాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థుల్లో లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపొందించాలని వినాయక్‌నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల హెచ్ఎం లతగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థి ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్: తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లాని శివ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌లను పంపిణీ చేశారు. మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాజు గగన్, దుర్గయ్య, బండారుపల్లి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ టాపర్‌కు ఆర్థికసాయం అందజేత



డిచ్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీలో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని కూర శ్రీజకు శుక్రవారం గోర్తి ఈశ్వర ట్రస్ట్ ప్రతినిధులు రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాధ్యులు పాటుకూరి తిరుపతి రెడ్డి, హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పడకల్ గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి రూ. 25 వేల నగదు ప్రోత్సాహం అందించినట్లు గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఉమ్మడి జిల్లాల బాధ్యుడు పాటుకూరి తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న శివచరణ్ రెడ్డి

నిజామాబాద్ సిటీ: యువజన కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయడం అభినందనీయం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు 25శాతం టిక్కెట్లు పార్టీ నుంచి వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కావలెను
కామారెడ్డి, నిర్మల్ జిల్లాలలో ప్రకటనలు సేకరించుటకు అనుభవం కలిగిన యువకులు కావలెను.
అడ్వర్టైజ్‌మెంట్ సేల్స్ ట్రైనీ
అర్హతలు : ఏదైనా డిగ్రీ
వయస్సు : 19 నుండి 30 సం॥లోపు వారై ఉండాలి.
అనుభవం : ఇతర దినపత్రికలలో ప్రకటనల విభాగంలో పనిచేసిన వారు మరియు వివిధ కంపెనీలలో మార్కెటింగ్ రంగంలో పనిచేసిన వారు / ఫ్రెషర్స్‌కు కూడా అవకాశం.
జీతభత్యాలు : ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటీవ్స్.
ఇంటర్వ్యూ తేది: 14-07-2025 (సోమవారం)
ఉ.11:00 గం. నుండి మ.3:00 గం. వరకు
E-mail id: kamal@sakshi.com
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP
సాక్షి యూనిట్ కార్యాలయము
సర్వే నెం.158/ఎ గ్రా॥ నడిపల్లి మ॥ డిచ్‌పల్లి
జిల్లా॥ నిజామాబాద్. సెల్: 9912220764

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
: 9010585333
: 9849180084
: 9866958550
: 7893150102
: 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899